

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.4,59,020
బంగారం 1 గ్రాము 700 మిల్లీ గ్రాములు
వెండి 65 గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



చదవకుండానే సర్టిఫికెట్లు..!

● నకిలీ సర్టిఫికెట్ల ముఠా అరెస్టు

-8లో



'సహకార ఉద్యమాన్ని బలోపేతం చేద్దాం'

-8లో

సంరక్షించేవారేరీ..!

గంజాం జిల్లా రుశికుల్యా నది, బంగాళఖాతం ముఖద్వారం ప్రాంతంలో ప్రతీ ఏడాదిలాగే ఈ ఏడాది సైతం సంతానాభివృద్ధికి అధిక సంఖ్యలో తాబేళ్లు విచ్చేశాయి. రికార్డు స్థాయిలో దాదాపు 6 లక్షల తాబేళ్లు గుడ్లు పెట్టి మరలా సముద్రంలోకి వెళ్లాయి. అయితే అధికారుల నిర్లక్ష్యంతో చిట్టి తాబేళ్లు లోకాన్ని చూసే అవకాశం లేకుండా పోతోంది. తీరంలో పెట్టిన గుడ్లకు రక్షణ కరువై గ్రద్దలు, కాకులు, కుక్కలు, నక్కల పాలవుతున్నాయి. గోకురుకుదా, పుర్ణాబొందొ, అర్జీపల్లి, నూవా కేవుటిగాం తీరంలో గుడ్లను భద్రపరచకపోవడంతో అలలకు కొట్టుకుపోయి తాబేళ్ల సంతానం లేకుండా పోతుందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుడ్లకు అన్నివిధాలుగా రక్షణ కల్పిస్తున్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో అధికారుల జాడ కరువైందని వాపోతున్నారు. జిల్లాకే గర్వకారణమైన ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణపై ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. – బరంపురం



సముద్రంలోకి కొట్టుకుపోతున్న గుడ్లు

- ఆలివ్ రిడ్లేపై నిర్లక్ష్యం
- పక్షుల పాలవుతున్న గుడ్లు
- పట్టించుకోని అధికారులు







గుడ్లను తింటున్న కాకులు, గ్రద్దలు





పురణబొంద తీరంలో గుడ్లు పెడుతున్న తాబేలు (ఫైల్)

న్యూస్‌రీల్

'విజయవంతం చేయండి'



గడబగుడలో సమావేశమైన యాదవ సమాజ్ సభ్యులు

జయపురం: ఏప్రిల్ 16వ తేదీన జయపురంలో నిర్వహించనున్న కొరాపుట్ జిల్లా యాదవ మహాసభను విజయవంతం చేయాలని యాదవ సమజ్ కో–ఆర్డినేటర్ సాధీరామ్ నాయిక్ పిలుపునిచ్చారు. స్థానిక గడబగుడ గ్రామంలో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవ సాంప్రదాయాల పరిరక్షణ, రాజకీయ సంబంధిత హక్కుల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఉన్న యాదవ సామాజికవర్గ ప్రజలు సమావేశాలకు వచ్చేటట్లు చూడాలని విజ్ఞప్తి చేశారు. కొరాపుట్ జిల్లా యాదవ సమాజ్ సాధారణ కార్యదర్శి రాజేంద్ర కుమార్ గౌఢ అధ్యక్షతన జరిగిన సమావేశం కోట్‌పాడ్ యాదవ సమాజ్ నేతలు పదలామ్ గౌఢ, బలరాం గౌఢ, తులారాం గౌఢ, త్రినాథ్ గౌఢ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన పూరీ–గుణుపురం ఎక్స్‌ప్రెస్



పట్టాలు తప్పిన ట్రైన్

పర్లాకిమిడి/భువనేశ్వర్: పూరీ–గుణుపురం ఎక్స్‌ప్రెస్ మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు పూరీ వద్ద పట్టాలు తప్పింది. దీంతో చివరి బోగీ ఒకపక్కకు ఒరిగిపోయింది. అయితే ట్రైనులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని పూరీ రైల్వేస్టేషన్ అధికారులు తెలియజేశారు. రైల్వే అధికారులు లైన్‌ను సరిచేయడంతో, గంట ఆలస్యంగా ట్రైన్ బయల్దేరింది.

మారణాయుధాలతో దాడి

● యువతీ, యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన యువతీ, యువకుడు

బరంపురం: నగరంలోని సిద్ధార్థ విహార్‌లో ఉన్న ఒక ఇంటి దగ్గర మాట్లాడుకుంటున్న యువతీ, యువకుడిపై దుండగులు మారణాయుధాలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన చర్చనీయాంశంగా మారింది. ఐఐసీ అధికారి భూపతి మహంతి తెలిపిన సమాచారం మేరకు ఒక ఇంటి దగ్గర యువకుడు రాజేశ్వర్‌రావు, యువతి మౌనిత మాట్లాడుకుంటున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు మారణాయుధాలతో దాడిచేసి పరారయ్యారు. సమాచారం అందుకున్న పెద్ద బజార్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తీవ్రగాయాలతో ఉన్నవారిని ఎంకేసీజీ మెడికల్ కళాశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

765 కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

కొరాపుట్: జిల్లాలోని లమ్తాపుట్ పోలీసులు 765 కేజీల గంజాయిని మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. లమ్తాపుట్ సమితి బలేల్ గ్రామ పంచాయతీ ఖలేపుట్ గ్రామంలోని ఖగపతి ఖిలో ఇంట్లో గంజాయి ఉందన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఆ ఇంట్లో 33 బస్తాల్లో 765 కేజీల గంజాయి పట్టుబడింది. ఇంటి యజమాని ఖగపతి ఖిలో అప్పటికే పరారయ్యాడు. ఈ గంజాయి రవాణా సిద్ధంగా ఉండడంతో పోలీసులకు సమాచారం వచ్చింది. దాడిలో మాచ్‌ఖండ్, లమ్తాపుట్ పోలీసులు సంయుక్తంగా పాల్గొన్నారు.

వృద్ధులకు దర్శన భాగ్యం

- తిరుపతి, వెళ్లూరు, శ్రీకాళహస్తికి ప్రత్యేక ట్రైన్
- ఏర్పాటు చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ
- తీర్థయాత్రకు వెళ్లిన 970 మంది వృద్ధులు



యాత్రకు సిద్ధమైన వయోవృద్ధులు



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న మంత్రి సరక తదితరులు

రాయగడ: రాష్ట్రంలోని కొరాపుట్, నవరంగపూర్, రాయగడ, నువాపడ, మల్కన్‌గిరి, కలహండి జిల్లాలకు చెందిన 970 మంది వయో వృద్ధులకు ప్రముఖ తీర్థ స్థలాలైన తిరుపతి, వెళ్లూరు, శ్రీకాళహస్తి ప్రాంతాలను దర్శించేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక రైలు సౌకర్యం కల్పించింది. వయో వృద్ధుల తీర్థ యాత్ర యోజన కింద రాష్ట్ర పర్యాటక శాఖ వీరికి ఈ సౌకర్యాన్ని కల్పిస్తోంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అన్ని సౌకర్యాలు కల్పించింది. సోమవారం రాయగడకు చేరుకున్న వృద్ధులకు పట్టణంలోని అశోక్ కల్యాణ మండపం, కృష్ణచంద్ర నగర భవనం తదితర ప్రాంతాల్లో వసతి, భోజన సౌకర్యాలను ఏర్పాటు చేసింది. మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక రైలులో వీరిని తీర్థ స్థలాలకు తరలించింది. మంత్రి జగన్నాథ సరక జెండా ఊపి యాత్రను ప్రారంభించారు.

ఇప్పటివరకు 8,500 మందికి యాత్ర

ఈ సందర్భంగా మంత్రి జగన్నాథ సరక మాట్లాడుతూ.. 2016లో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందని తెలియజేశారు. ఇప్పటివరకు 8,500 మంది వయో వృద్ధులను తీర్థయాత్రలకు తరలించినట్లు వెల్లడించారు. ముఖ్యంగా ఆదివాసీ, గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక ఇబ్బందుల కారణంగా పుణ్యక్షేత్రాలు దర్శించుకోలేని ఎంతోమంది అభాగ్యులను పథకం కింద తీర్థయాత్రలకు పంపినట్లు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఆలోచించే సీఎం నవీన్ పట్నాయక్ ఈ వినూత్న యోజన అమలు చేయడంతో వృద్ధుల ఆశీర్వాదాలు పొందుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. కలెక్టర్ సింగ్ మాట్లాడుతూ ఆరు జిల్లాల నుంచి చేరుకున్న వృద్ధులకు ముందుగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. అనంతరం ఈ యాత్రకు అనుమతించడం జరిగిందన్నారు. అంతకుముందు వయోవృద్ధులను సగౌరవంగా రైల్వేస్టేషన్‌కు ఆహ్వానించారు. అందుకు ప్రత్యేక బృందాన్ని జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. యాత్రను ముగించుకొని ఏప్రిల్ 2న మరలా వీరు రాయగడ చేరుకుంటారు. కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో, ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి, రాష్ట్ర పర్యాటక శాఖ అదనపు సెక్రటరీ బాలముకుంద భుయ్యా, బిజు స్వాస్థ్య సమితి రాష్ట్ర శాఖ సలహాదారుడు సుధీర్ దాస్, ఏడీఎం ధర్మానంద బెహర తదిరులు పాల్గొన్నారు.



ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలు

నిర్వాసితులను ఆదుకునేందుకు చర్యలు



బాధితులతో మాట్లాడుతున్న అప్పలస్వామి

రాయగడ: రైల్వే ఆక్రమణలు తొలగిస్తున్న నేపథ్యంలో నిర్వాసితులను ఆదుకునేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు ప్రారంభించింది. వసుంధర పథకంలో భాగంగా నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు బాధితుల నమోదు ప్రక్రియ కోసం నోటీసులు జారీ చేసింది. రైల్వే డివిజన్‌గా గుర్తింపు పొందిన రాయగడలో దీనికి సంబంధించిన కార్యాలయాలు, స్టాఫ్ క్వార్టర్స్ తదితర అభివృద్ధి పనుల కోసం రైల్వే విభాగం స్థలాన్ని సేకరిస్తుంది. గత కొన్నేళ్లుగా రైల్వేస్థలాలను ఆక్రమించుకుని ఉన్నవారిని తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో బాధితులు తామంతా ఇళ్లు కోల్పోయి రోడ్డున పడుతున్నామని, అందువలన జిల్లా యంత్రాంగం ఆదుకోవాలని విన్నవించిన నేపథ్యంలో వసుంధర పథకంలో ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు నిర్ణయించింది. దీనికోసం ఏప్రిల్ 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సనూచించారు. అనంతరం అర్హులైనవారికి ఇళ్ల స్థలాలను జిల్లా యంత్రాంగం కేటాయించనుందని తహసీల్దార్ తపస్ రౌత్ తెలియజేశారు. ఇదిలా ఉండగా ఆదివాసీ నాయకుడు అప్పలస్వామి కద్రక బాధితుల తరుపున గత కొన్నాళ్లుగా పొరాడుతున్నారు.

ఇద్దరు మైనర్లకు రూ.50 వేల జరిమానా





వాహన తనిఖీలు చేపడుతున్న అధికారులు

రాయగడ: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న ఇద్దరు మైనర్లకు స్థానిక రవాణా శాఖ అధికారులు ఒక్కొక్కరికీ రూ.25 వేల చొప్పున జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక అటానమస్ కళాశాల ప్రాంతంలో రవాణా శాఖ అధికారులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అహ్మద్ రజక్ ఖాన్, ఆయన్ పాండ్ అనే ఇద్దరు మైనర్ బాలలు ద్విచక్ర వాహనాలను నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని ఆపి తనిఖీ చేయగా ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో చర్యలు తీసుకున్నారు. లైసెన్స్ లేకపోవడంతో పాటు మైనర్లు కావడంతో ఇద్దరికీ కలిపి రూ.50 వేల జరిమానా విధించినట్లు ఆర్టీవో శివశంకర్ చౌదరి తెలియజేశారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలని నిరసన



ఆందోళన చేస్తున్న సర్పంచ్‌లు, సమితి సభ్యులు

జయపురం: సమితిలోని 10 పంచాయతీలకు ఉపాధి వేతనాలు అందకపోవడంతో బీడీవో కార్యాలయానికి తాళాలు వేసి సర్పంచ్‌లు, సమితి సభ్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమితిలోని 33 గ్రామ పంచాయల్లో కేవలం 13 పంచాయతీలకు మాత్రమే డబ్బులు వస్తున్నాయని పేర్కొన్నారు. తక్షణమే కూలీలకు వేతనాలు అందజేయాలని సూచించారు. దీనికి బ్లాక్ అధికారి రాజీవ్ దాస్ వివరణ ఇస్తూ నిబంధనలు ప్రకారం పనిచేసిన పంచాయతీలకు డబ్బులు చెల్లించినట్లు తెలియజేశారు. 10 పంచాయతీలకు ఏప్రిల్‌లో డబ్బులు చెల్లిస్తామని వెల్లడించారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు.

పట్టుబడిన గంజాయి ధ్వంసం



పట్టుబడిన గంజాయిని చూపిస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్, గుడారి, పద్మపూర్, గుణుపూర్ ప్రాంతాల్లో ఇటీవల జిల్లా పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్న 4,614.929 కిలోల గంజాయిని, సోమవారం ధ్వంసం చేసినట్లు ఎస్పీ వివేకానంద శర్మ ట్విట్టర్‌లో మంగళవారం తెలియజేశారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్న పోలీసు యంత్రాంగం ఇటీవల విస్తృతంగా దాడులు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. పట్టుకున్న గంజాయిని జిల్లా అదనపు కలెక్టర్ నారాయణ మిశ్రో, జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ అభిరాం బెహర తదితర ఉన్నతాధికారుల సమక్షంలో ధ్వంసం చేసినట్లు వివరించారు.

సరస్వతీ నమస్తుభ్యం

- సరస్వతీ దేవి అవతారంలో తరతరణి
- దర్శనానికి పోటెత్తిన భక్తులు

చైత్రమాసంలోని అతి ముఖ్యమైన మూడో మంగళవారం సందర్భంగా దక్షిణ ఒడిశా ప్రజల ఆరాధ్య దైవం, రూశికుల్యా నదీతీరంలో కొండపై కొలువైన తరతరణి అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పక్క రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి సుమారు 6 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొండ దిగువున వంటావార్పు చేసుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారికి మధ్యాహ్నం రాజభోగం, సాయంత్రం సంధ్యా హారతి, రాత్రి బెడా చేపట్టి ప్రత్యేక రథంలో తిరువీధి గావించారు. భక్తులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా ఒక డీఎస్పీ స్థాయి అధికారితో పాటు 10 మంది ఎస్‌ఐలు, 100 కానిస్టేబుల్స్ ఉత్సవాలను పర్యవేక్షించినట్లు ఎస్పీ జగ్‌మోహన్ మీనా తెలియజేశారు.

– బరంపురం



వేకువజామునే అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



పూజలందుకుంటున్న తరతరణి అమ్మవారు



కొండపైకి కాలినడకన వెళ్తున్న భక్తులు



తలనీలాలు సమర్పిస్తున్న దృశ్యం



విద్యుత్ కాంతుల్లో అమ్మవారి ఆలయం

చదవకుండానే సర్టిఫికెట్లు..!

- నకిలీ సర్టిఫికెట్ల ముఠా అరెస్టు
- పోస్టల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌తో కదిలిన డొంక
- కటకటాల్లోకి 21 మంది నిందితులు
- నిందితుల వద్ద 41 యూనివర్సిటీల ధ్రువపత్రాలు


అరెస్టైన నిందితులు

భువనేశ్వర్: బలంగీర్ నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంలో నిందితులను అరెస్టు చేశారు. పోస్టల్ ఉద్యోగాల కోసం బూటకపు విద్యార్హతలతో నకిలీ సర్టిఫికెట్లు జారీ చేయడంతో ఈ ఉదంతం వెలుగు చూసింది. ఇప్పటివరకు ఈ వ్యవహారంలో 21 మంది నిందితులను అరెస్టు చేసినట్లు బొలంగీరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ నితిన్ కుషాల్కర్ తెలిపారు. అరెస్టు చేసినవారిలో 19 మంది నిరుద్యోగ యువతతో పాటు కోచింగ్ సెంటర్ యజమాని, కంప్యూటర్ టీచర్ ఉన్నట్లు గుర్తించారు. ఒక ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ స్థావరంగా ఈ కుంభకోణం యథేచ్ఛగా కొనసాగింది. ఈ నేపథ్యంలో జరిపిన సోదాల్లో రూ.3,67,600 నగదుతో పాటు 41 ప్రముఖ యూనివర్సిటీలకు చెందిన 1,000 నకిలీ (డూప్లికేట్) సర్టిఫికెట్లు, వెరిఫికేషన్ రిపోర్టులు, నాలుగు కంప్యూటర్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, 33 స్టాంపులు, జిరాక్స్ మెషిన్, ప్రింటర్, సీల్స్, డైరీలు, రబ్బర్ స్టాంపులు, మొబైల్ ఫోన్లు, బ్యాంకు ఖాతాలు, భూపత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

అచ్చం ఒరిజినల్ మాదిరిగానే..

స్వాధీనం చేసుకున్న నకిలీ సర్టిఫికెట్లు అచ్చం ఒరిజినల్ సర్టిఫికెట్లు మాదిరిగానే ఉన్నట్లు ఎస్పీ వివరించారు. ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ యజమాని మనోజ్ మిశ్రా పలు విద్యాసంస్థల ఉద్యోగులతో సంబంధాలు బలపరచుకొని ఈ వ్యవహారం సాగిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ప్రత్యేక బృందం ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ వ్యవహారంలో భూముల అక్రమ కొనుగోలు వ్యవహారం సైతం బయటపడిందన్నారు. నిందితులకు వ్యతిరేకంగా కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు.

శాసనసభలో చర్చ

ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో బొలంగీర్ నకిలీ సర్టిఫికెట్ల అంశంపై చర్చ చోటుచేసుకుంది. కంటాబంజి నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే సంతోష్ సింగ్ సలూజా ఈ అంశాన్ని మంగళవారం శూన్య గంటలో లేవనెత్తారు. ఈ ఉదంతం రాష్ట్రంలో మేధావుల బతుకుల్ని అంధకారంలోకి నెట్టుతున్నట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఈ రాకెట్‌లో బిజూ జనతా దళ్ నాయకుల ప్రమేయం ఉందని ఆరోపించారు. ఓనమాలు తెలియని అభ్యర్థులు నకిలీ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఉద్యోగులుగా నియామకం కావడం విచారకరమన్నారు. వీరందర్నీ ఎన్ఎస్ఏలో బుక్ చేసేందుకు స్పీకర్ రూలింగ్ ఇవ్వాలని కోరారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ సర్టిఫికెట్లు


స్వాధీనం చేసుకున్న నగదు, మొబైల్ ఫోన్లు

ఇదీ విషయం

ఇటీవల విడుదలైన బ్రాంచ్ పోస్ట్ మేనేజర్ (బీపీఎం), సహాయ బ్రాంచ్ పోస్ట్ మేనేజర్ (ఏబీపీఎం), డాక్ సేవక్ వంటి 83 పోస్టుల భర్తీకి అభ్యర్థులు దాఖలు చేసిన మార్కు షీట్లు, సర్టిఫికెట్ల పరిశీలనలో తేడాలున్నట్లు పోస్టల్ అధికారులు గుర్తించడంతో ఈ రాకెట్ వెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని ఝూన్సీ నుంచి పొందిన నకిలీ మార్కు షీట్లు, సర్టిఫికేట్లను కనీసం 37 మంది అభ్యర్థులు దాఖలు చేశారు. వీరిలో ఇంగ్లిష్‌లో ఒకరు 98 శాతం, ఇంకొకరు 99 శాతం మార్కులు పొందినట్లు గుర్తించడంతో డొంక కదిలింది. ఈ ఇద్దరు అభ్యర్థులు డిపార్ట్‌మెంట్ నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షలో విఫలమయ్యారు. దీనిపై ఆరా తీయడంతో ఒక అభ్యర్థి రూ.50,000 చెల్లించి బోర్డు పరీక్ష సర్టిఫికెట్‌ను కొనుగోలు చేసినట్లు బహిరంగ పరిచాడు. నిందితులు గత ఎనిమిది నుంచి పదేళ్లుగా ఈ రాకెట్‌ను నడుపుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ వ్యవధిలో చాల మంది నిరుద్యోగులు నిర్దిష్ట కోచింగ్ సెంటర్ నుంచి నకిలీ సర్టిఫికేట్లు పొంది అక్రమంగా ఉద్యోగాలు సంపాదించారన్నారు. నిందితులు ఒక్కో సర్టిఫికేట్, మార్క్ షీట్‌కు రూ.1.5 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. నిరుద్యోగుల ఆరాటాన్ని సొమ్ము చేసుకునే సందర్భాల్లో ఒక్కో నకిలీ సర్టిఫికేటు కోసం రూ.5 లక్షల వరకు గుంజినట్లు తేలిందన్నారు.

క్లుప్తంగా

పగలు ఎండ.. సాయంత్రం వర్షం


పర్లాకిమిడిలో కురుస్తున్న వర్షం

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గత రెండు రోజులుగా పగటిపూట ఉష్ణోగ్రతలు, సాయంత్రం వర్షం కురుస్తోంది. వర్షంతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందుతున్నారు. ముఖ్యంగా గుమ్మా, కాశీనగర్, గుసాని ప్రాంతంలో అధికంగా వర్షపాతం నమోదవుతున్నట్లు అధికారులు తెలియజేశారు. ఉగాది నుంచి వర్షాల వల్ల మహేంద్రతనయ నదిలో నీరు చేరడంతో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని పేర్కొంటున్నారు.

బీజేడీలోకి తిరుపతి పాణిగ్రాహి


తిరుపతిని బీజేడీలోకి ఆహ్వానిస్తున్న బబిదాస్

కొరాపుట్: జిల్లా కాంగ్రెస్ నాయకుడు తిరుపతి పాణిగ్రాహి బీజేడీలో చేరారు. మంగళవారం ఉదయం జిల్లా కేంద్రంలోని స్పెషల్ సర్క్యూట్ హౌస్‌లో బీజేడీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బబిదాస్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. తిరుపతి గతంలో కొరాపుట్ జిల్లా డుమ్రిపుట్ సమీపంలోని పదంపూర్ పంచాయతీలో కాంగ్రెస్ పార్టీకి గట్టి నాయకునిగా పనిచేశారు. కార్యక్రమంలో కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడాల్ తదితరులు పాల్గొన్నారు.

మత్తిలిలో వీకే పాండ్యన్ పర్యటన


అధికారులతో మాట్లాడుతున్న పాండ్యన్

మల్కన్‌గిరి: రాష్ట్ర ప్రభుత్వ 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ జిల్లాలోని మత్తిలి సమితిలో మంగళవారం పర్యటించారు. సమితిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. అలాగే రైల్వేలైన్ పురోగతిపై సమీక్షించారు. అనంతరం షహిద్ లక్ష్మణ్ నాయిక్ స్వగృహంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 5టీ కార్యక్రమం సభ్యులు వీనిల్ కృష్ణ, మల్కన్‌గిరి కలెక్టర్ విశాల్‌సింగ్, రాష్ట్ర అభివృద్ధి శాఖ కమిషనర్ అనూ అర్గ్ తదితరులు పాల్గొన్నారు. బుధవారం మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో పర్యటిస్తారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ఘటనా స్థలంలో చిదంబర్ మృతదేహం

చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): బొడ్డుగూడెం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన చిదంబర్ (60) మృతి చెందారు. ఒడిశా రాష్ట్రం కొరాపుట్‌కు చెందిన ఒక కుటుంబం హైదరాబాద్ వెళ్లి తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు బొడ్డుగూడెంలోని బాలికల ఆశ్రమ పాఠశాల ఎదురుగా అదుపుతప్పి చెట్టుకు ఢీ కొట్టింది. ఈ ఘటనలో చిదంబర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురికి గాయాలు కావడంతో సమీపంలోని ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం భద్రాచలం తరలించారు. చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల సమక్షంలోనే భూ సరిహద్దుల గుర్తింపు

కొమరాడ: రైతుల సమక్షంలోనే భూముల సరిహద్దులు గుర్తించాలని తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని ఆర్తాం గ్రామంలో జరిగిన గ్రామసభలో భూముల రీసర్వేపై సమీక్షించారు. సర్వే సక్రమంగా చేయాలని, రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు పరిష్కారమయ్యేలా సర్వే జరగాలని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

‘సహకార ఉద్యమాన్ని బలోపేతం చేద్దాం’


మాట్లాడుతున్న ఈశ్వరచంద్ర పాణిగ్రాహి


సమావేశంలో పాల్గొన్న సహకార సంస్థల ప్రతినిధులు

జయపురం: అవిభక్త కొరాపుట్ జిల్లాలో సహకార ఉద్యమాన్ని బలోపేతం చేద్దామని కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్(కేసీసీ బ్యాంక్) అధ్యక్షుడు ఈశ్వర చంద్ర పాణిగ్రాహి పిలుపునిచ్చారు. జయపురంలోని కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో కేసీసీ బ్యాంక్ 72వ వార్షిక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సహాయక పథకాలను సహకార సంస్థలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సహకార సంస్థలను లాభాల బాటలోకి తీసుకెళ్లేందుకు అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు. బ్యాంక్ కార్యదర్శి కృష్ణచంద్ర ధని ముందుగా స్వాగతం పలికారు. బ్యాంక్ ప్రధాన కార్యాలయ మేనేజర్ హరిహర త్రిపాఠీ సభా కార్యక్రమాలు పర్యవేక్షించారు. 2021–22 ఆడిట్ రిపోర్టును సభ్యులకు అందజేశారు. బ్యాంక్ ఆదాయ, వ్యయ లెక్కలను సభ ఆమోదించింది. 2021–22 సంవత్సరంలో నికర లాభాలను పంచినట్లు వెల్లడించారు. సమావేశంలో బ్యాంక్ ఉపాధ్యక్షురాలు దురుపుత భొత్ర, బ్యాంక్ పరిచాలన పరిషత్ డైరెక్టర్లు, అవిభక్త కొరాపుట్ జిల్లాల బ్యాంక్ అనుబంధ సహకార సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైలుమార్గం భూసేకరణకు గ్రామసభ


రైలుమార్గం దిశ మార్చాలని అధికారులను కోరుతున్న ప్రజలు

జయపురం: జయపురం–నవరంగపూర్‌ల మధ్య నూతన రైలుమార్గం నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం బొరిగుమ్మ సమితి దుల్లాగుడ గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైలు మార్గానికి భూములు ఇవ్వాలని అధికారులు విజ్ఞప్తి చేయగా, రైతులు అంగీకరించలేదు. తాము భూములు కోల్పోతే ఉపాధి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన రైలుమార్గ దిశను మార్చాలని కోరారు. అయితే ప్రస్తావిత రైలు మార్గాన్ని మార్చడం జరగదని భారతీయ రైల్వే విభాగ అధికారి ఎస్.గోపాలుడు స్పష్టం చేశారు. ప్రతిపాదిత రెండు లైన్ల రైలుమార్గం ఎట్టి పరిస్థితిల్లోనూ మార్చడం జరగదని వివరించారు. అందువలన భూమిని కోల్పోనున్న రైతులు నష్ట పరిహారం తీసుకోవాలని కోరారు. భూసేకరణ సర్వే జరిపేందుకు ప్రజలు సహకరించాలని జయపురం సబ్ కలెక్టర్ ప్రధాన్ విజ్ఞప్తి చేశారు. భూమి కోల్పేయేవారికి లభించే పరిహారం వివరాలు రైల్వే విభాగ స్వాతంత్ర్య భూసేకరణ అధికారి వివరంగా తెలియజేశారు. సమావేశంలో భూసేకరణ అధికారి సూరజ్ పట్నాయిక్, తహసీల్దార్ సబ్యసాచి జెన, బొరిగుమ్మ అదనపు తహసీల్దార్, రైల్వే భూసేకరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జగులై మాత గ్రామ పరిక్రమ


జగులై మాత గ్రామ పరిక్రమ నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ఖుర్దారోడ్ కుదియారి గ్రామ దేవత జగులై వసంత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. దీర్ఘకాలం తర్వాత ఈ ఏడాది జగులై మాత కుదియారి గ్రామ పరిక్రమ మంగళవారం నిర్వహించారు. పల్లకిలో జగులై మాత గ్రామంలో వీధుల గుండా గొడొ బొఘెంయి పీఠానికి చేరడం విశేషం. జగులై, బొఘెంయి ఇరువురు అక్కాచెల్లెళ్లుగా గ్రామస్తులు పేర్కొంటారు. ఉత్సవాలు పురస్కరించుకుని వీరివురి భేటీ జరగడంపై సర్వత్రా ఆనందం వ్యక్తం అయింది. దాదాపు 100 ఏళ్లగా వీరివురి భేటీ స్తంభించి పోయిందని గ్రామస్తులు తెలిపారు. బొఘెంయి పీఠంలో మధ్యాహ్నం విశ్రమించి, సాయంత్రం 4 గంటల ప్రాంతంలో స్వస్థానానికి జగులై మాత ఊరేగింపు ఆరంభమైంది. పీఠానికి చేరిన తర్వాత మహాస్నానం సేవ ముగించి అమ్మవారికి మహాగౌరి అలంకరణ చేశారు. అనంతరం నిత్య పూజాదులతో ఉత్సవ సేవాదులు చేపట్టారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు.

నేడు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక బీఎస్ఆర్ కళింగ వైశ్య కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కుంబురుక దీనమయ్య, ఏపీఎం ఆదయ్య ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి హాజరవుతారని, మండల స్థాయి నాయకులు, లబ్ధిదారు మహిళలంతా హాజరు కావాలని వారు కోరారు.

అన్నదానం


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పాలకొండ రూరల్: పాలకొండ-వీరఘట్టం రోడ్డులో కొలువైన గారమ్మ తల్లికి భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు బాగుండాలని, రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

వసతిగృహం సందర్శన


విద్యార్థినుల వసతిగృహం సందర్శిస్తున్న ప్రిన్సిపాల్ జీవన్‌జ్యోతి

సీతంపేట: స్థానిక పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతి గృహాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌జ్యోతి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులకు అందిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని, జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వ్యాయామం చేసుకోవాలని సూచించారు.

106 ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టం


కళ్లికోటలో నేలమట్టమైన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ నిర్మల

కొమరాడ: మండల వ్యాప్తంగా ఇటీవల ఈదురుగాలులతో కూడిన కురిసిన వర్షానికి కళ్లికోటలోని దాదాపు 106 ఎకరాల్లోని మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు కురుపాం వ్యవసాయ సహాయ సంచాలకులు అలజంగి నిర్మల తెలిపారు. మంగళవారం ఆ గ్రామంలో నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలించిన ఆమె ఈ అకాల వర్షాలు మరో రెండు రోజుల పాటు ఉంటాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంటల కోత పనులను వాయిదా వేసుకోవాలన్నారు. దళాయపేట, గుణానపురం, గంగారేగువలస గ్రామాల్లో జరిగిన పంటనష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారని, ఇప్పటివరకు 196 మంది రైతులకు సంబంధించి, 175 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తేలిందన్నారు. ఈ వివరాలను రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శిస్తామన్నారు. మండల వ్యవసాయాధికారి పి.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


గరుగుబిల్లి: గొట్టివలసలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


సీతంపేట: ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు

గరుగుబిల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సులేఖ సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని గొట్టివలస గ్రామంలో మంగళవారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిగించారు. మనం రోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎప్పటికప్పుడు చిన్నారుల బరువు, ఎత్తు కొలవాలని, ఏవైనా తేడాలు వస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. స్థానిక సామాజిక భవనం నుంచి బస్టాండ్ వరకు జరిగిన ఈ ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు కేంద్రాల ద్వారా ఇచ్చే పౌష్టికాహారం తీసుకుని, తినాలన్నారు. తద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ పీఓ గీత సూచించారు. స్థానిక కస్పా, కోమటి, కొత్త వీధుల్లోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు మండల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సందర్శించిన ఆమె అక్కడి లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్యార్థులకు చేస్తున్న విద్యాబోధనపై ఆరాతీశారు. కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఇవ్వాలని, చిన్నారుల బరువు, ఎత్తు సరిచూడాలన్నారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి ఉన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే


అలరించిన విద్యార్థినుల డ్యాన్స్

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫేర్‌వెల్ డే కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, విద్యార్థినుల నృత్య ప్రదర్శన అలరించింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కె.ప్రసాద్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. ఎంజాయ్‌మెంట్‌తో పాటు చదువు కూడా ఉండాలన్నారు. బాగా చదువుకుని, భవిష్యత్‌లో ఉన్నత స్థాయి చేరుకోవాలని ఆకాంక్షించారు.

నేడు అశోకాష్టమి సెలవు

భువనేశ్వర్: ఏకామ్ర క్షేత్రంలో లింగరాజు ప్రభువు వార్షిక రుకుణ యాత్ర పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఖుర్దా జిల్లావ్యాప్తంగా అశోకాష్టమి సందర్భంగా బుధవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు స్థానిక సెలవుగా పేర్కొన్నారు. రెవెన్యూ డివిజనల్ కమిషనర్ (ఆర్‌డీసీ) సెంట్రల్ డివిజన్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

రుకుణ రథయాత్ర కార్యక్రమాలు (బుధవారం)

కార్యక్రమం	వేళ
మంగళ హారతి	ఉదయం 5 గంటల నుంచి 5.30 గంటల వరకు
సర్వ దర్శనం	ఉ. 5.30 గం. నుంచి 6.30 గంటల వరకు
మహా స్నానం, అలంకరణ, సూర్యపూజ, ద్వార పాలకుల పూజ	ఉ. 7 గంటల నుంచి 8 గంటల వరకు
లింగరాజు, భువనేశ్వరి వల్లభ భోగం, ప్రాతః ధూపం	ఉదయం 8 గంటల నుంచి 9.45 గంటల వరకు
భోగ మండపం	ఉదయం 10.45 గంటల వరకు
మహా స్నానం, అలంకరణ, సూర్యపూజ, ద్వార పాలకుల పూజ	మధ్యాహ్నం 12 గంటల వరకు
యాత్ర పూజాదులు	మధ్యాహ్నం 12.30 గంటల వరకు
ఉత్సవమూర్తుల రథారోహణ	మధ్యాహ్నం 1.30 గంటల వరకు
రథంపై పూజలు	మధ్యాహ్నం 3.30 గంటల వరకు
రథం లాగడం ఆరంభం	మధ్యాహ్నం 3.30 గంటల నుంచి
రామేశ్వర మందిరం ప్రవేశం	సాయంత్రం 7.30 గంటలకు
లింగరాజు ఇతరే సేవాదులు	సాయంత్రం 7.30 గంటల నుంచి

న్యూస్‌రీల్

2న జిల్లా చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-17 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు ఏప్రిల్ 2వ తేదీన జరగనున్నాయి. శ్రీకాకుళం నగరంలోని నానుబాల వీధిలో గల చెస్ కోచింగ్ సెంటర్‌లో చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు ఏపీ రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి సనపల భీమారావు తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2006 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలని స్పష్టంచేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారుల్లో బాలికలు విజయవాడలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. అలాగే బాలురు అనకాపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీచెస్.ఓఆర్జీ వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9912559735 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాకు చెందిన క్రీడాకారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రూ.లక్షల్లో పన్నుల వసూలు



వడ్డీ మాఫీతో మున్సిపాలిటీకి పన్ను చెల్లిస్తున్న ట్రాన్స్‌పోర్ట్ యజమాని

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో ఆస్తి పన్నుని ఈ నెల 31 తేదీలోపు చెల్లించిన వారికి వడ్డీమాఫీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ తెలిపారు. మున్సిపాలిటీ ఏఎస్‌పేట బోర్డర్‌లో గల సౌత్‌ఈస్టర్న్ రోడ్ వేస్ కార్యాలయం-1 పన్నుని 2008 నుంచి ఇప్పటివరకు చెల్లించలేదు. దీంతో వడ్డీతో కలిపి రూ.23,79,461, సౌత్‌ఈస్టర్న్ రోడ్‌వేస్ కార్యాలయం-2 కి సంబంధించిన పన్ను 2019 నుంచి ఇప్పటి వరకు చెల్లించక పోవడంతో వడ్డీతో కలిపి రూ.2,27,466లకు బకాయిలు చేరాయి. బకాయి మంగళవారం మున్సిపాలిటీకి చెల్లించడంతో ఆస్తిపన్ను వడ్డీ మొత్తం మాఫీ చేశారు. కార్యాలయం-1 నకు రూ.9,07,508, సౌత్‌ఈస్టర్న్ రోడ్వేస్ కార్యాలయం-2 నకు రూ.1,57,394 లను చెల్లించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, మున్సిపల్ ఆర్‌ఐ అమర్, వార్డు కౌన్సిలర్ తవిటయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆ నలుగురిపై వేటు సరైనదే



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, పార్టీలో ఉంటూ క్రమశిక్షణ తప్పితే చర్యలు తప్పవని, దీనికి నిదర్శనమే ఆ నలుగురు ఎమ్మెల్యేల సస్పెన్షన్ అని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీతో చేతులు కలిపి సొంత పార్టీకి వ్యతిరేకంగా వ్యవహించిన ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం సరైన నిర్ణయమేనని అన్నారు. పార్టీ నిర్దేశించిన వ్యక్తికి కాకుండా మరో వ్యక్తికి ఓటేసినట్లు నిర్ధారణ అయిన తర్వాతే చర్యలు తీసుకున్నారని తెలిపారు. జగనన్న ఫొటోతో గెలిచిన వీరు వెన్నుపోటు పొడవటం బాధాకరమన్నారు. అలాగే సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై ఆ నలుగురు ఎమ్మెల్యేలు విమర్శలు చేయడం తగదన్నారు. ఎవరైనా సరే పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాల్సిందేనని తెలిపారు. రానున్న ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని, మళ్లీ జగనన్నను సీఎం చేసే వరకూ అందరూ కష్టపడి పని చేయాలని కోరారు.

ఉద్దానం జీడి తోటల్లో ఎలుగు



జీడి తోటల్లో కనిపించిన ఎలుగు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దానం రైతులకు ఎలుగు గుబులు వెంటాడుతూనే ఉంది. మంగళవారం అక్కుపల్లి-గరుడబద్ర పరిసర జీడి తోటల్లో ఎలుగు కనిపించడంతో వారు హడలిపోయారు. పక్క తోటలో జీడి పిక్కలు సేకరిస్తున్న రైతులు ప్రాణ భయంతో పరుగులు తీశారు.

ప్రత్యేక అలంకరణలో విజయగణపతి



విజయగణపతి

శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రొడ్డులోని విజయగణపతి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

రహదారిపై రక్షాకవచం



రహదారులను ఎంత విస్తరించినా ఇంకా చాలదన్నట్లు కిక్కిరిసిపోతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న వాహనాలు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రమాదాలు సృష్టిస్తూనే ఉన్నాయి. రోడ్డెక్కే వారు క్షేమంగా, భద్రంగా తిరిగి వచ్చేవరకు బెంగే. ప్రధాన రహదారులు ప్రమాదాల నిలయాలుగా.. మృత్యుదారులుగా మారిపోతున్నాయి. ఆ ప్రమాదాల దారులపైనే వారు ఉద్యోగం చేస్తున్నారు. నిత్యం రోడ్లపైనే సంచరిస్తూ ప్రమాదాలను సవాల్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలు రక్షించడానికి తమ ప్రాణాలను ఫణంగా పెడుతున్నారు. వారే హైవే పెట్రోలింగ్ పోలీసులు. జాతీయ, రాష్ట్ర రహదారులపై రెప్పవాల్చకుండా నిఘా పెట్టి శక్తి మేరకు రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేస్తున్నారు. క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రులకు తరలించి ప్రాణదాతలుగా నిలుస్తున్నారు.



- ప్రాణ రక్షణే ధ్యేయంగా హైవే పెట్రోలింగ్ టీం కృషి
- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ
- ప్రతి 20 కిలోమీటర్లకు ప్రత్యేక వాహనం
- బ్లాక్‌స్పాట్‌లపై ప్రజలకు విస్తృత అవగాహన

శ్రీకాకుళం డెస్క్/ క్రైం

175 కిలోమీటర్ల జాతీయ రహదారి.. మరో 50 కిలోమీటర్ల స్టేట్‌హైవే.. ప్రతి 20 కిలోమీటర్లకు ఓ వాహనం.. ప్రతి వాహనంలో ముగ్గురు సిబ్బంది అత్యంత అప్రమత్తంగా విధి నిర్వహణ.. నిరంతరం మోగే వైర్‌లెస్ సెట్లలో ఆదేశాల్ని పాటిస్తూ మూడు షిఫ్టుల్లో ప్రజారక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నారు హైవే పెట్రోల్ సిబ్బంది. ఎక్కడైనా ప్రమాదం జరిగితే క్షణాల్లో చేరుకుని గోల్డెన్ ఆవర్‌లో క్షతగాత్రుల్ని ఆస్పత్రికి తరలించి ప్రాణాల్ని కాపాడుతున్నారు. జిల్లాలో గుర్తించిన 57 బ్లాక్ స్పాట్‌లపై ప్రత్యేక దృష్టిసారించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రధాన విధులు:

- జాతీయ రహదారిపై నిఘా..
- జాతీయ రహదారిపై ఉండే పాఠశాలల పరిసరాల్లో స్కూల్‌కు వెళ్లేటప్పుడు.. బడి పిల్లలు స్కూల్ నుంచి వచ్చేటప్పుడు ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం.
- ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను వారికి నిర్దేశించిన సమయంలో కవర్ చేయడం.
- అధిక వేగంగా ప్రయాణించే వారిని నిరోధించడం.
- ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా అప్రమత్తంగా వ్యవహరించడం.
- భారీ వాహనాలకు సంబంధించిన ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రుల్ని గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రులకు తరలించడం.. రోడ్డును వెంటనే క్లియర్ చేయడం..
- రాత్రి వేళల్లో వాహనాలు నడిపే డ్రైవర్లను టోల్ ప్లాజాల వద్ద ఆపి ఫేస్‌వాష్(స్టాప్-వాష్-గో) కార్యక్రమం నిర్వహణ..

బ్లాక్ స్పాట్ అంటే..

మూడేళ్ల కాలపరిమితిలో ఐదుసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగినా లేదా ఒకే స్పాట్‌లో (ప్రమాదం) పది మంది వరకు చనిపోయినా ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా పరిగణిస్తారు.



బ్లాక్ స్పాట్‌లు ఎక్కడెక్కడ..

- ఎచ్చెర్ల మండల పరిధిలో అధికంగా 7 బ్లాక్ స్పాట్‌లున్నాయి.
- శ్రీకాకుళం రూరల్ పరిధి, జేఆర్‌పురంలలో 6 చొప్పున బ్లాక్ స్పాట్‌లున్నాయి.
- సరుబుజ్జిలి, నందిగాం మండలాల పరిధిలో 4 చొప్పున ఉన్నాయి.
- కోటబొమ్మాళి పరిధిలో 3 ఉన్నాయి.
- నరసన్నపేట, కాశీబుగ్గ, బారువ, కంచిలి, మందస పరిధిలో రెండేసి చొప్పున స్పాట్స్ ఉన్నాయి.
- గార, ఆమదాలవలస, టెక్కలి, ఇచ్ఛాపురం టౌన్, పాతపట్నం, కొత్తూరు పరిధిలో ఒక్కో బ్లాక్ స్పాట్‌ను గుర్తించారు.
- వీటితో పాటు ట్రాఫిక్‌కు సంబంధించి వివిధ ప్రాంతాల్లో కొన్ని బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు.

57 బ్లాక్‌స్పాట్‌ల పైనే దృష్టి..

జిల్లా వ్యాప్తంగా 57 బ్లాక్‌స్పాట్‌లను అధికారులు గుర్తించారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఆ బ్లాక్ స్పాట్‌లపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి రోజూ ఆయా ప్రాంతాలపై అవగాహన కల్పిస్తూ.. అతి వేగం ప్రమాదకరమనే విషయాన్ని వాహనచోదకులకు వివరిస్తున్నారు. బ్లాక్‌స్పాట్‌లపై అవగాహన విషయంలో సిబ్బందికి జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక ప్రత్యేక సూచనలిస్తూ ప్రమాదాల నివారణకు తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. అలాగే బ్లాక్ స్పాట్‌లు ఉండే ఏరియాలో ప్రత్యేక బోర్డుల ఏర్పాటు చేస్తూ ప్రాణం విలువ తెలిసేలా వివిధ అవగాహన కార్యక్రమాలను జిల్లా పోలీసులు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం, సాంకేతిక ఇతర అంశాలపై క్షుణ్నంగా అధ్యయనం చేసి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.





భద్రతే మా బాధ్యత..



జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు జరగకుండా భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాం. డ్రోన్ కెమెరాలతో 57 బ్లాక్ స్పాట్‌లు గుర్తించాం. భద్రతా నియమాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. మొబైల్ పెట్రోల్ టీమ్‌ల పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. ప్రతి నెలా సమీక్షా సమావేశంలో జిలా కలెక్టర్, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే అథారిటీ, ఇంజినీర్లతో ప్రమాదాల నివారణపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై చర్చిస్తున్నాం. నేషనల్ హైవే అథారిటీ, ఆర్‌అండ్‌బీ వారు రోడ్డు పక్కనే కాక అండర్ పాస్ వే కింద ఇసుక, మట్టి, ముళ్లపొదలు వంటివి ఎప్పటికప్పుడు క్లీన్ చేసి, స్కూల్, విలేజ్ జోన్ వంటి వాటి దగ్గర మిడిల్ వేలైన్ నుంచి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తే మరింతగా ప్రమాదాలను నివారించవచ్చు.

– జీఆర్ రాధిక, జిల్లా ఎస్పీ

అనుక్షణం అప్రమత్తం..



ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటున్నాం. రహదారిపై సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసేవారికి కౌన్సిలింగ్ ఇస్తున్నాం. బ్లాక్‌స్పాట్‌ల వద్ద అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదం జరిగిన సమాచారం అందిన వెంటనే వీలైనంత వేగంగా సంఘటనా స్థలికి చేరుకుని సేవలందిస్తున్నాం.

–జగన్‌మోహన్‌రావు, హెడ్‌కానిస్టేబుల్, హైవే పెట్రోలింగ్ టీమ్

నిరంతర గస్తీ..



24 గంటలు సిబ్బంది విధుల్లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందగానే సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. ప్రాణరక్షణే ప్రథమ కర్తవ్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు. లోకేషన్ ఆధారంగా ప్రతి గంటకూ వీరిని మోనిటరింగ్ చేస్తుంటాం.

– బూర ప్రసాదరావు, ఇన్‌చార్జి సీఐ, డీటీఆర్‌బీ

హనుమ గుండెలో రామ



భద్రాచలంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస గ్రామానికి చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. హనుమంతుని గుండెల్లో రాముని అవతావరం ఉన్నట్లు ఇసుకతో వేసిన సైకత శిల్పం చూపరులను ఆకర్షిస్తోంది.

ఆమదాలవలస రూరల్

అమ్మకి వందనం



మండలంలోని అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాతపట్నంకు చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో (మాతృదేవోభవ) తల్లికి వందనం కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు బి.గొల్లవాడు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో వారి తల్లులకు పాదపూజ చేయించారు. ఎంఈఓలు కె.రాంబాబు, ఎం.వెంకటరమణలు పాల్గొని కార్యక్రమాన్ని మెచ్చుకున్నారు. అనంతరం టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు.

హిరమండలం

కల్యాణాంగ ధ్వజారోహణం



అరసవల్లి సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. చైత్ర శుద్ధ సప్తమి పర్వదినాన కల్యాణ మహోత్సవాల్లో తొలిరోజున కల్యాణాంగ ధ్వజారోహణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ గరుడ ధ్వజస్తంభం వద్ద పతాకావిష్కరణ, ధ్వజారోహణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహించారు. సకలదేవతలకు ఆహ్వానం పలికేలను ఆహ్వానం పలికేందుకు గరుత్మంతునికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో కొలువైన శ్రీవారికి ప్రత్యేక అర్చనలను చేసిన అనంతరం ధ్వజపతాకం వద్ద దిగ్బలి ప్రదానం, మహాహారతి నిచ్చారు. కార్యక్రమంతో కళ్యాణోత్సవాలు ప్రారంభమైనట్లుగా ప్రధానర్చకులు శంకరశర్మ ప్రకటించారు.

అరసవల్లి

అమృత జలధారకు ఆర్థిక సాయం

శ్రీకాకుళం పాతబస్టాండ్: షెడ్యూల్ కులాల యువ పారిశ్రామిక వేత్తల పథకం, అమృత జలధారకు ఆర్థిక సాయం అందిస్తామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. 2022-23లో ఎస్సీ రైతుల వ్యవసాయానికి నీటి పారుదల సౌకర్యం, ఆదాయ ఉత్పాదక కార్యకలాపాల కోసం ఎస్సీ యువ పారిశ్రామిక వేత్తల పథకం, అమృత జలధారకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి అనుచిత్ జాతి అభ్యుదయ యోజనపై ఆయన సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. సంబంధిత శాఖలు అర్హులైన ఎస్సీ లబ్ధిదారులను గుర్తించి అర్హుల జాబితాను మార్చి 29లోగా ఈడీ ఎస్సీ కార్పొరేషన్‌కు అందించాలన్నారు. జిల్లాలో కమ్యూనిటీ సహజ రైతుల కోసం విత్తనం ఇతర అనుబంధ పనిముట్లను సేకరించేందుకు రూ.10,000 ఆర్థిక సాయం అందించడానికి 344 మందిని గుర్తించినట్లు తెలిపారు. అర్హులైన రైతులు ఆర్థిక సహాయం కోసం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడానికి వారి పేర్లను ఫార్వార్డ్ చేయడానికి స్థానిక రైతు భరోసా కేంద్రాలు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్, డ్వామా పీడీ చిట్టిరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామారావు, పరిశ్రమల శాఖ డీడీ ఉమా మహేశ్వరరావు, ఎల్‌డీఎం, డీపీఎం రేవతి గ్రౌండ్ వాటర్ డీడీ సత్య జీవ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

పారదర్శకంగా కారుణ్య నియామకాలు

అరసవల్లి: జిల్లా పరిషత్ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా కారుణ్య నియామకాల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోంది. వివిధ కారణాలతో మృతి చెందిన పీఆర్ ఉద్యోగుల కుటుంబ సభ్యుల్లో అర్హులకు మంగళవారం ఉదయం మొత్తం 10 మందికి వివిధ మండలపరిషత్‌లలో ఉద్యోగాలను కల్పిస్తూ ఉత్తర్వులు అందజేయగా, మరో నలుగురు ఉద్యోగులకు పదోన్నతులను కల్పించేలా జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ చర్యలు చేపట్టారు. సాంఘిక భద్రత కారుణ్య పథకం కింద టైపిస్టులుగా కె.చందన వంశీ (ఎంపీపీ బూర్జ), ఎం.దేవి (పిఆర్‌ఐ, టెక్కలి), వెంకట ప్రవీణ (ఎంపీపీ వజ్రపుకొత్తూరు), ఎస్.రతన్ జగన్మోహన్ (ఎంపీపీ జి.సిగడాం), బెహరా నీరజ (పిఆర్‌ఐ, పాలకొండ)లకు నియామక పత్రాలను అందజేశారు. అలాగే ఆఫీస్ సబార్డినేట్లుగా పి.సత్యశ్రీనివాసరావు (జెడ్పీ స్కూల్, మందరాడ), కె.అశోక్ (జెడ్పీ స్కూల్, సారవకోట), కాళ్ల కుమారి (ఎంపిపి, సోంపేట), మండ చిన్నమ్మడు (ఎంపిపి ఎల్ఎన్‌పేట), పాత్రుని భారతి (ఎంపిపి ఆమదాలవలస)లకు నియామక పత్రాలను అందించారు. ఆఫీసు సబార్డినేట్లుగా పనిచేస్తున్న ఎ.తిరుమలరావు (జెడ్పీ స్కూల్, ఒంకులూరు). వై.ప్రమీల (జెడ్పీ స్కూల్ మందస). కె.నాగభూషణం (జెడ్పీ స్కూల్, ఎర్రముక్కాం), ఎంఎస్.భగవాన్‌రెడ్డి (జెడ్పీ స్కూల్, బిఆర్‌సి పురం)లకు రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఈవో ఆర్.వెంకట్రామన్, పరిపాలనాధికారి డివిఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగా ఉద్యోగాలు పొందిన వారితో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ప్రక్కనే సిఈవో వెంకట్రామన్

నిజాయితీగా పనిచేయండి

రాష్ట్ర ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తున్న క్రమంలో జిల్లా పరిషత్‌లో కూడా అదే రీతిలో పాలన అందిస్తూ అడుగులు వేస్తున్నాం. గత ఏడాది కొందరికి, ఈ ఏడాది 10 మందికి ఇలాగే కారుణ్య నియామక పత్రాలు అందజేశాం. అయితే కొత్తగా ఉద్యోగాలు పొందిన వారు, పదోన్నతులు పొందిన వారు..ఎవ్వరికీ ఒక్క రూపాయి ఇవ్వనవసరం లేదు. నిజాయితీగా పనిచేస్తే మంచిపేరు వస్తుంది.

– పిరియా విజయ, జెడ్పీ చైర్ పర్సన్

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం



సింగుపురం ప్రధాన రోడ్డులో మార్కెట్ నిర్వహిస్తున్న స్థలం ఇదే

- గోడ కట్టిన ఆక్రమణదారు
- నోటీసులు అందజేసిన అధికారులు

శ్రీకాకుళం రూరల్: తరతరాలుగా గ్రామ చావిడీ, బందీలదొడ్డి, మార్కెట్ కొనసాగుతున్న ఆ ప్రభుత్వ భూమిపై ఆక్రమణదారు కన్నుపడింది. రెవెన్యూ రికార్డులను మార్పు చేస్తూ ఆ స్థలం తమదంటూ ఏకంగా గోడ కట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న అధికారులు ఆ ప్రయత్నాన్ని అడ్డుకుని సదరు వ్యక్తికి నోటీసులు జారీ చేశారు. శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం మేజర్ పంచాయతీలో ప్రధాన రోడ్డును ఆనుకొని సర్వే నంబర్ 712లో 2లో ఆరు సెంట్ల స్థలం ఉంది. ఒకప్పుడు రెవిన్యూ ఆధీనంలో ఉన్న ఇదే స్థలంలో గ్రామచావిడి సభలు, సదూర ప్రాంతాల వారికి నుంచి వచ్చేవారికి రాత్రిబసలు, గ్రామ అవసరాల కోసం ఈ స్థలానే వాడుకునేవారు. అంతేకాకుండా పశువులు, పందుల జరిమానా వసూళ్లకు సంబంధించిన బందీలదొడ్డిగానూ పూర్వం ఇక్కడే నిర్వహించేవారు.



బస్‌షెల్టర్‌ను నిర్మించిన దృశ్యం

మార్కెట్ నిర్వహణ..

ఈ స్థలంలో కొంతభాగం సింగుపురం గ్రామస్తుల సౌకర్యార్థం బస్టాండ్ ఏర్పాటు చేసుకున్నారు. మిగిలిన స్థలంలో చుట్టుపక్కల రైతులు తాము పండించిన పంటలను ఉదయం, సాయంత్రం వేళ ఇక్కడే విక్రయించుకుంటున్నారు. 40 సంవత్సరాలుగా ఈ మార్కెట్ కొనసాగుతోంది. ఇప్పుడు ఈ స్థలం తమ ఆధీనంలో ఉందంటూ, మార్కెట్ నిర్వహణ కొనసాగించవద్దంటూ చుట్టూ ప్రహరీ కట్టేందుకు ఓ వ్యక్తి పూనుకున్నాడు. విషయం తెలుసుకున్న మండల పరిషత్ కార్యాలయ అధికారులు ఈ ప్రక్రియను అడ్డుకున్నారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ వారం రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు.

స్వాధీనం చేసుకుంటాం

ప్రస్తుతం ఆ స్థలం వివాదంలో ఉన్న విషయం వాస్తవమే. రెవెన్యూ రికార్డుల పరంగా పరిశీలించి నోటీసులు అందించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటాం. మండల పరిధిలో ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవు.

వెంకటరావు, శ్రీకాకుళం రూరల్ తహశీల్దార్

ట్రిపుల్ ఐటీలో నీటి సౌకర్యానికి చర్యలు



బోరు పనులు పర్యవేక్షిస్తున్న డైరెక్టర్ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) రన్నింగ్ నీటి సౌకర్యంపై అధికారులు తక్షణ చర్యలు ప్రారంభించారు. దీనిలో భాగంగా మంగళవారం రెండు బోర్ల నిర్మాణం చేపట్టారు. విద్యార్థుల ఫిర్యాదుల నేపథ్యంలో తాగు నీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.8 లక్షలు కేటాయించింది. బోరు పనులను క్యాంపస్ డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు పర్యవేక్షించారు. ప్రస్తుతం ఉన్న బోర్లతో నీటి వనరులు తగ్గటం, కలుషితం కావటం వంటి సమస్యల వల్ల రన్నింగ్ నీటి సరఫరా పూర్తిస్థాయిలో సాధ్యం కావటం లేదని, తాజాగా బోర్లు ఏర్పాటు చేసిన నేపథ్యంలో సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు.